క్లుప్తంగా

పారా మెడిక్స్ సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి: కమ్యూనిటీ పారా మెడిక్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తారు రాజశేఖర్ సోమవారం టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారా మెడిక్స్ కోసం జీవో నంబర్ 429 పునరుద్ధరించాలని, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇప్పించాలని, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అవకాశం కల్పించాలని, సంఘానికి స్థలం కేటాయించాలని కోరారు. సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని విన్నవించారు.

ప్రైవేట్ స్కూల్స్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు

టెక్కలి: ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా టెక్కలికి చెందిన బరాటం శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో భాగంగా తనను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన్ని అభినందించారు.

కార్యదర్శిపై చర్య తీసుకోవాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: కరోనా సమయంలో చేసిన పనులకు బిల్లులు పెడితే వాటిని ఇప్పటి వరకు మంజూరు చేయని బిర్లంగి పంచాయతీ కార్యదర్శిగా అప్పట్లో పనిచేసిన ఎస్.కృష్ణపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బాకి లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన కలెక్టర్ మనజీర్ జీలాని సమూన్‌కు వినతిపత్రం అందించారు. 2020–21లో బిర్లంగి గ్రామ సచివాలయానికి పెయింటింగ్ రూ.90 వేలు, ఆర్‌డబ్ల్యూస్ స్కీమ్ మరమ్మతులకు రూ.98 వేలు ఖర్చు చేశానని.. వాటిని మంజూరు చేయాలి కోరారు.

పీహెచ్‌సీ తనిఖీ

సంతబొమ్మాళి: దండుగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.ప్రసాదరావు సోమవారం తనిఖీ చేశారు. ఉద్యోగులు హాజరు పట్టీ, వివిధ ఆరోగ్య కార్యక్రమాల రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఆస్పత్రి ప్రసవాలను పెంచాలన్నారు. ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 1,2 వైద్య శిబిరాల్లో వచ్చిన ఆరోగ్యశ్రీ రిఫరల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరును (ఎఫ్ఆర్ఎస్) ఉద్యోగులందరూ కచ్చితంగా సమయానికి నమోదు చేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సుధీర్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ ఉన్నారు.

30 మందికి నేత్ర పరీక్షలు


నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యుడు

కంచిలి: ముండ్ల పంచాయతీ పరిధి సాగరనౌగాం గ్రామంలో సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 30 మందికి పరీక్షలు చేశారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ రామచంద్ర ప్రధాన్ ప్రారంభించారు. ఐదుగురికి క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరమని, ఆరుగురికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఆప్తాలమిస్ట్ కిరణ్, సిబ్బంది వైద్యసేవలందించారు.

పునరావాస కేంద్రానికి సాయం


రమేష్‌కు విరాళం అందిస్తున్న విద్యార్థినులు

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ప్రాంగణంలో దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్రం భవనం నిర్మాణానికి సోంపేట గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు 11,116 రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని సంస్థ వ్యవస్థాపకుడు గుల్ల రమేష్‌కు సోమవారం అందజేశారు. విద్యార్థుల దాతృత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పాస్టర్స్ నూతన కార్యవర్గం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు చెందిన పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. సోమవారం ఈదుపురం బాప్టిస్ట్‌చర్చిలో జిల్లాపాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బందారి ప్రభుదాస్, కార్యదర్శిగా ఎ.సుందర్‌రాజు, గౌరవ అధ్యక్షుడుగా డి.ఏలియా, కోశాధికారిగా ఎం.పాల్, ఉపాధ్యక్షుడుగా వై.ప్రభుదాస్, జాయింట్ సెక్రటరీగా వి.ప్రశన్నకుమార్, సలహాదారులుగా ఎం.అబ్రహం, జి.ఏలీయాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పనులు పూర్తి చేసి మంచి పేరు తేవాలి

● మండల సమావేశంలో సభ్యులు


మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి

వజ్రపుకొత్తూరు: పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సభ్యులు అన్నారు. ప్రజల వద్దకు వెళ్లే సమయంలో ఎక్కడా పెండింగ్ అనే సమస్య రానీయకూడదని జెడ్పీ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి, ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. వజ్రపుకొత్తూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నీలవేణి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సభలో వివిధ శాఖలపై జరిగిన సమీక్షలో సభ్యులు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి తొమ్మిది శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడంపై సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చి జెడ్పీ సీఈవో దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ అన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈఈ శ్రీకాంత్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామాల్లో నిర్మించిన ఇళ్లు ఏ స్టేజీలో ఉన్నాయో కూడా ఆయనకు తెలియడం లేదని సభ్యులు అన్నారు. గత మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను కూడా ఇప్పటికీ పరిష్కరించలేదని సభ్యులు మండిపడ్డారు. అక్కుపల్లి పాఠశాలలో నాడు–నేడు పనులు చేపట్టడంలో అక్కడ హెచ్ఎం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ నెల 20వ తేదీలోగా పనులు చేపట్టకుంటే పాఠశాలకు తాళాలు వేస్తామని సభ్యులు అల్టిమేటం ఇచ్చారు. విద్యుత్ శాఖ ఏఈఈ మండలంలో లేకపోవడంతో సమస్యలు పెరుగుతున్నాయని, కొత్తపేట పంచాయతీలో లోటల్టేజీ, శిథిలమైన స్తంభాలు, ఇతర విద్యుత్ సమస్యలు ఉన్నా లైన్‌మేన్, లైన్ ఇన్‌స్పెక్టర్ పట్టించుకోవడం లేదని సభ్యులు అన్నారు. పొల్లాడ–కొమరల్తాడ మధ్య కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరినా ఇంతవరకు స్పదించలేదని సర్పంచ్‌లు అంబటి శ్రీను, అట్టాడ గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు గుంటు మాకయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే సమావేశంలోగా పరిష్కరించకుంటే సమావేశాన్ని బహిష్కరిస్తామని ఎంపీపీ నీలవేణి దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని, తరచూ దాడులు చేస్తున్న ఎలుగుబంట్ల కదలికలపై దృష్టి సారించడంలో విఫలమయ్యారని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. ప్రస్తుతం జీడి రైతులు తోటలకు వెళ్లే సమయంలో ప్రజలకు రక్షణ కల్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో గృహ నిర్మాణాల విషయంలో పర్యవేక్షణ కొరవడిందని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులు తీసుకువచ్చిన సమస్యలను వారంలోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీపీ నీలవేణి హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో డిక్కల తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, తమ్మినేని శాంతారావు, వైస్ ఎంపీపీలు తమ్మినేని శ్రావణి, వంక రాజు, ఉప తహసీల్దార్ వాయిపల్లి గిరిరాజు, మండల విప్ తిర్రి గుణ పాల్గొన్నారు.

భూ దందాపై చర్యలు తీసుకోండి

బెండి కొండ పరిధి నారాయణపురం సోషల్ ఫారెస్టు భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతం అవుతున్నాయని.. 40 ఎకరాలను కొంతమంది ఆక్రమించేసి కంచెలు నిర్మిస్తున్నారని పెద్ద బొడ్డపాడు సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల సమావేశంలో ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్మన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కాపీలను అందజేశారు. సర్వేనంబర్ 242, 258లో బెండికొండను ఆనుకొని ఉన్న సుమారు 200 ఎకరాల్లోని 40 ఎకరాల సోషల్ ఫారెస్టులో భూమి చేజిక్కించుకునేందుకు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని, ఈ భూ దందాకు ఫారెస్టు గార్డు సూత్రధారిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత మండల సమావేశంలో కూడా దీనిపై ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలోని నారాయణపురం, సీతాపురం, కొల్లిపాడు, ఉద్దానం కూర్మనాథపురం గ్రామాలు ఉన్నాయని.. అక్కడ భూమి లేని నిరుపేదలు ఎంతో మంది ఉన్నందున వారికి ఆ భూములు కేటాయిస్తే జీడి పంటను సాగు చేసుకుంటారన్నారు.

లోకేష్‌వి అన్నీ అబద్ధాలే

● ఎంపీపీ బోర పుష్ప


మాట్లాడుతున్న ఎంపీపీ బోర పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: టీడీపీ నాయకుడు నారా లోకేష్ నోరు విప్పితే అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ఏమాత్రం అవగాహన లేకుండా మట్లాడటం, ఎర్ర బుక్కు చూపించి ఎర్రి వేషాలు వేయడం అలవాటుగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. ఆదివారం ఇచ్ఛాపురంలో నిర్వహించిన శంఖారావం కార్యక్రమంలో ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గానికి ఏమి చేశారని లోకేష్ ప్రశ్నించిన నేపథ్యంలో సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ టీడీపీ పాలనలో అభివృద్ధి పేరిట శిలాఫలకాలు వేసి వదిలేయగా.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శిలాఫలకాల స్థానంలో అభివృద్ధి చేసి చూపించామన్న సంగతి లోకేష్‌కు తెలిశా అని ప్రశ్నించారు. అరకబద్ర వంతెన పూర్తి చేశామని, మత్స్యకార బిర్లంగి, బాలకృష్ణాపురం, కొళిగాం, బలరాంపురం గ్రామాలకు తారురోడ్లు వేశామన్నారు. ప్రస్తుతం కేధారిపురం గ్రామానికి కోటి రూపాయాలతో రోడ్డు వేస్తున్నామన్నారు. ఈదుపురంలో రైతులకు అవసరమైన గ్రోయిన్, ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. ఎమ్మెల్యే అశోక్ మరోమారు మండలంలో పర్యటించి తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూడాలని సూచించారు. టీడీపీ మోసకారి మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని అన్నారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు,జెట్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, రంగాల జానీ, ఆశి కృష్ణారెడ్డి, రాంపత్ని చిట్టిబాబు, లోపింటి దుర్యోధన, శ్రీనివాసరావు ఉన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


జీఎస్ఎస్ రాజును సత్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: మారుతున్న కాలంతో పాటు వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని విజయనగరం సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీ.ఎస్ఎస్.రాజు అన్నారు. 'సిగ్నల్ ప్రాసెసింగ్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్స్ 'అనే అంశం పై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, అటల్ అకాడమి, ఈసీఈ విభాగం సంయుక్తంగా వారం రోజుల పాటు నిర్వహించనున్న అధ్యాపక శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధ్యాపకులకు వృత్తి నైపుణ్యాలు మరింత పెంచుకోవాడానికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జీఎస్ఎస్ రాజును కళాశాల యాజమాన్య ప్రతినిధులు సత్కరించారు. కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.విజయ్‌కుమార్, అధ్యాపకులు డి.ఆజాద్, బి.రామారావు, జయ పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా బైక్‌ర్యాలీ


ర్యాలీలో ప్రజాసంఘాల ప్రతినిధులు

కాశీబుగ్గ: ఈనెల 16న జరగనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాశీబుగ్గ పెంట దాలయ్య ఆశ్రమం నుంచి మూడు రోడ్ల కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా పలాస జూనియర్ కాలేజీ వరకు ర్యాలీ సాగింది. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలతో రైతులు, కార్మికులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న బంద్‌కు రైతులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు మద్దతు ఇవ్వాలని కోరారు. చాపర వేణుగోపాల్, సీపీఐ లిబరేషన్ నాయకులు సన్యాసిరావు, శ్రీనివాస్, ఐద్వా నాయకులు ఢిల్లేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భాస్కరరావు, జీడి రైతుల సంఘం నాయకులు వి.పాపారావు, భవన నిర్మాణ సంఘం నాయకులు సింహాచలం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


సీఎం జగన్, మంత్రి సీదిరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మందస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని పలువురు అన్నారు. మందసలో సీఎం జగన్, మంత్రి సీదిరి అప్పలరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల కష్టాలు తెలుసుకున్న జగనన్న నాలుగు సంవత్సరాలుగా వాహన మిత్ర రూపంలో రూ.10 వేలు అందజేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆటో డ్రైవర్ల కుటుంబాలు జగనన్న వెంటే ఉంటామన్నారు. మంత్రి అప్పలరాజును కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. వాహనమిత్ర అందజేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మహేంద్ర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కంచిబెహరా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గిన్ని తిరుపతిరెడ్డి, శానాపతి కిశోర్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, గౌడుకురా, దువ్వు జగదీష్, షావుకారి మోహనరావు, ఈశ్వరరావు, తమిరియా శోభన్‌బాబు,యూనియన్ నాయకులు లక్ష్మణరావు, భైరాగి, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్య పరిష్కారం


సమావేశమైన నాయకులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో కొంతకాలంగా సర్పంచ్ కాల్ల సంజీవరావు, ఈవో చింతాడ సన్యాసి మధ్య ఉన్న విభేదాల కారణంగా తొమ్మిది నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు విడుదల కాలేదు. ఈ సమస్యను పరిష్కరించాలని కార్మికులు ఎంపీపీ రోణంకి ఉమ, ఎంపీడీవో వై.పద్మజ దృష్టికి తెచ్చారు. దీంతో సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి సర్పంచ్, ఈవోలను పిలిపించి జీతాలు మంజూరుకు ఒప్పించారు. బిల్లులపై సంతకాలు చేయించారు. మొదట విడతలో నాలుగు నెలల జీతాలు ఇచ్చేందుకు, అనంతరం మిగిలిన బకాయిలు విడుదల చేసేందుకు సమావేశంలో నిర్ణయించారు. నాయకులు రోణంకి మల్లయ్య, పేడాడ వెంకటరావు, సింగిపురం వినోద్ ఉన్నారు.

తక్షణ సాయం అందజేత


గోపమ్మకు సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: లండారిపుట్టుగ గ్రామానికి చెందిన మామిడి రాముడు ఇటీవల చనిపోయారు. ఈయన వైఎస్సార్ బీమా పాలసీదారుడు. దీంతో తక్షణ సాయంగా పది వేల రూపాయలు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని నామినీగా ఉన్న గోపమ్మకు ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు వైఎస్సార్‌బీమా పథకం వరమలాంటిదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి మోహనరావు, తాతయ్య, తులసయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు కేటాయింపునకు చర్యలు

కంచిలి: ఏపీ ప్రైవేట్ (అన్–ఎయిడెడ్) పాఠశాలల్లో ఆర్‌టీఈ యాక్ట్ 2009 ప్రకారం పేద విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో–1 ఎస్.శివరాంప్రసాద్ చెప్పారు. ఈ మేరకు షెడ్యూల్, మార్గదర్శకాలతో కూడిన నోటిఫికేషన్ ఉత్తర్వులు ప్రభుత్వం విడుదల చేసిందని సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. అనాథ, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు ఐదు శాతం, ఎస్సీలకు పది, ఎస్టీలకు నాలుగు, బలహీన వర్గాలకు(బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు ఆరు శాతం సీట్లు కేటాయించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాఠశాల సందర్శన

ఇచ్ఛాపురం రూరల్: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు ద్వారా బోధన చేయాలని ఎంఈవో కురమాన అప్పారావు ఉపాధ్యాయులకు సూచించారు. అయ్యవారిపేట ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. చదవడం, రాయడం వంటి కృత్యాలను చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

టెక్కలి రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి కోరారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం జోనల్ టు క్రీడల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. మూడురోజుపాటు నిర్వహించనున్న క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు. టెక్కలి, పాతపట్నం నియోజకవర్గంలోని సుమారు 90 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి బి.నారాయణరావు తెలిపారు. హెచ్ఎం డి.నాగభూషణం, ఎంఈవో తులసీరావు రెడ్డి, చిన్నారావు ఉన్నారు.

డిప్యూటీ ఈవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న విజయకుమారి

టెక్కలి రూరల్: టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారిణిగా ఆర్.విజయకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. స్థానిక బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి లిప్ ప్రోగ్రాంపై జరుగుతున్న తీరును, అలాగే ఈ నెల 15వ తేదీన స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈమెతోపాటు ప్రధానోపాధ్యాయులు ఎం.శోభారాణి, ఎ.నాగభూషణం, ఉపవిద్యా కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కలసికట్టుగా పనిచేసి

విజయం సాధిద్దాం


టెక్కలి: దువ్వాడ వాణి ఆధ్వర్యంలో కార్యకర్తలతో భేటీ అయిన శ్రీనివాసరావు

● వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు


ఇచ్ఛాపురం: శ్రీనివాసరావుకి స్వాగతం పార్టీ నాయకులు


నందిగాం: శ్రీనివాసరావును సన్మానిస్తున్న పేరాడ తిలక్ తదితరులు

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని పార్టీ ముఖ్యనేతలతో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి పార్టీ విజయానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నర్తు నరేంద్ర, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, ముఖ్యనేతలు పిలక సంతోష్, తడక జోగారావు, ఇప్పిలి కృష్ణారావు, నర్తు ప్రసాద్, ఉలాల కోదండరామ్, ప్రకాశరావు పట్నాయక్, రాంజీ, భీష్మ, కౌన్సిలర్లు ఉన్నారు.

టెక్కలిలో కార్యకర్తలతో భేటీ

టెక్కలి: విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం టెక్కలిలో కార్యకర్తలతో భేటీ అయ్యారు. జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి ఆధ్వర్యంలో కార్యకర్తలతో మాట్లాడి నియోజకవర్గంలో పరిస్థితులను తెలుసుకున్నారు. ఈయనతో పాటు శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, ఎంపీపీ ఎ.సరోజమ్మ, టెక్కలి, కోటబొమ్మాళి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు సత్తారు సత్యం, బాడాన మురళి, నాయకులు సత్తారు ఉషారాణి, చుక్క గున్నమ్మ, జి.అప్పలరెడ్డి, జి.మోహన్ రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, పి.రాకేష్, పి.శ్రీనివాస్, టి.లోకేష్, టి.కామినాయుడు, ఎ.రాహుల్, బి.శ్రీను, దాలయ్య ఉన్నారు.

చిన్నశ్రీనుకు తిలక్ సన్మానం

నందిగాం: వైఎస్సార్ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావును పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సోమవారం సన్మానించారు. శ్రీనివాసరావు ఇచ్ఛాపురం వెళ్తూ మార్గమధ్యంలో నందిగాంలో పార్టీ ప్రాంతీయ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి తదితర నాయకులు ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని సూచించారు. నాయకులు అంబోడి విష్ణు, కణితి నారాయణమూర్తి, బొమ్మాళి గున్నయ్య, తమిరె రాజు, బుడ్డ మోహన రెడ్డి ఉన్నారు.

టీడీపీ మాజీ సర్పంచ్‌పై రైతులు ఫిర్యాదు


సబ్ కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: నరసింగపల్లి గ్రామంలో సర్వే నంబరు 255లో 5.20 సెంట్ల భూమి వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. అయితే పంచాయతీకి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ పోలాకి షణ్ముఖరావు అధికారులను మేనేజ్ చేసుకుని పాస్ పుస్తకాలు చేయించుకున్నారని.. తక్షణమే వాటిని రద్దు చేయాలని బాధిత రైతులు తామరాపల్లి శ్యామలరావు, ఎన్ని తులసమ్మ, ఎన్ని కలవయ్య, ఇప్పిలి ఏకాశమ్మ, ఇప్పిలి మల్లేష్, వరిశ మల్లేష్ తదితరులు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు సోమవారం నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. షణ్ముఖరావు తనను మభ్యపెట్టి ముందుగా నా భూములపై పవర్ ఆఫ్ అటార్నీ రాయించుకుని ఆపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని దీనిపై కోర్టును ఆశ్రయించానని శ్యామలరావు తెలిపారు. అయితే కోర్టులో కేసు పెండింగ్ ఉండగా గుట్టు చప్పుడు కాకుండా పాస్ పుస్తకాలు చేయించుకున్నారని తక్షణమే వాటిని రద్దు చేసి తనకు న్యాయం చేయాలని శ్యామలరావు విన్నవించారు.

సబ్ కలెక్టర్‌ను కలిసి ఎమ్మెల్సీ దువ్వాడ

టెక్కలితో పాటు నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్ సమస్యలపై ఎమ్మెల్సీ, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ దృష్టికి తీసుకువెళ్లారు. కొన్ని చోట్ల కోర్టు పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే జర్నలిస్టుల హౌసింగ్ పట్టాలపై సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈయనతో పాటు టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత ఉన్నారు.

వైఎస్సార్ చేయూతపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న చేయూత లబ్ధిదారులు

మందస: పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, సర్పంచ్ మార్పు భవాని అన్నారు. బిన్నళమదనాపురంలో సోమవారం వైఎస్సార్ చేయూత లబ్ధిదారులతో అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత నిధులతో చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని, జీవనోపాధులు పెంచుకోవాలన్నారు. పంచాయతీలో 134 మందికి చేయూత నిధులు ప్రభుత్వం మంజూరు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.కృష్ణమూర్తి, వీవోఏ జల్లు కరుణశ్రీ పాల్గొన్నారు.

మహదేవిపురంలో భూసర్వే ప్రారంభం


డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు అన్నారు. మహదేవిపురంలో సోమవారం సమగ్ర భూసర్వేలో భాగంగా డ్రోన్‌తో చేపట్టే సర్వేను ప్రారంభించారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఇంత సమగ్రంగా భూసర్వే ఎన్నడూ జరగలేదని, రైతులకు ఈ సర్వే ఓ వరమని అన్నారు. తగాదాలు, సమస్యలు లేని భూయాజమాన్య హక్కులు జగనన్న ప్రభుత్వం కల్పించిందని అన్నారు. కావున ప్రతీ రైతు తమ భూములను దగ్గర ఉండి సర్వే చేయించుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ కె.తిరుపతిరావు, ఉప సర్పంచ్ తమ్మినేని రామ్మూర్తి, గ్రామ పెద్దలు తమ్మినేని నాగేశ్వరరావు, డి.దశరథుడు, డ్రోన్ పైలట్‌లు ప్రసాదరావు, భాను ప్రతాప్, వీఆర్‌ఓ వైకుంఠరావు, విలేజ్ సర్వేయర్ మీనాక్షి ఉన్నారు.